క్లుప్తంగా

కరాటేలో ప్రతిభ



దంతాలపల్లి: వరంగల్‌లోని మున్సిపల్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన వరల్డ్ కరాటే టోర్నమెంట్‌లో అక్షర హైస్కూల్ విద్యార్థులు పతకాలు సాధించారు. అండర్–12లో గ్రీన్ బెల్ట్, కటా విభాగంలో గోల్డ్ మెడల్, కుమిటీ సిల్వర్ మెడల్ సాధించిన డి.కీర్తన, అండర్–11లో గోల్డ్ మెడల్ సాధించిన భార్గవిలను పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ సింగారపు యాకయ్య శాలువాతో సత్కరించి అభినందించారు.

తీజ్ వేడుకలు ప్రారంభం



గార్ల: బంజారా గిరిజనులు సోమవారం గార్లలో తీజ్ వేడుకలను ప్రారంభించారు. వారం రోజులపాటు గిరిజనులు ఆటపాటలతో సంబురాలు జరుపుకుంటారు. ఈనెల 13వ తేదీన గోధుమ బుట్టలకు స్థానిక పాకాల ఏటిలో నిమజ్జనం చేస్తారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు, కృష్ణపవాన్, గూగులోత్ శ్రీను, సామానాయక్, మహిళలు పాల్గొన్నారు.
తొర్రూరు: పట్టణంలోని దుబ్బతండాలో సోమవారం రాత్రి తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎన్నారై, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

గూడూరు: మహిళలు కుట్టు శిక్షణతోపాటు ప్రభుత్వం చూపుతున్న ఉపాధి మార్గాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో సోమవారం నాక్ సంస్థ ద్వారా శిక్షణ పొందిన 21మంది భవన నిర్మాణ రంగ కార్మిక మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాక్ వరంగల్ శాఖ ఇన్‌స్ట్రక్టర్ కె.సబిత, హెచ్‌ఎం కాంతారావు, బీఎస్‌ఆర్‌కెఎస్ జిల్లా అధ్యక్షుడు సిరికొండ సాయిలు పాల్గొన్నారు.

రాగి జావ ప్యాకెట్లు..



దంతాలపల్లి: మండలంలోని విద్యా వనరుల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ ట్రెనింగ్‌ను సోమవారం ఎంఈఓ జి.రాము సందర్శించారు. అనంతరం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాగి జావ ప్యాకెట్లను పాఠశాలకు అందజేశారు. మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శరణ్ పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్ ఏర్పాటుకు సర్వే

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలోని పెద్దచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చేందుకు సర్వే చేపట్టారు. డోర్నకల్ మున్సిపాలిటీ అభివృద్ధికి మంజూరైన రూ.25 కోట్ల నిధుల నుంచి రూ.3.7 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్‌ను ఏర్పాటు చేయనున్నారు. మున్సిపల్ డీఈ జాటోత్ భద్రు ఆధ్వర్యంలో సోమవారం పెద్ద చెరువు వద్ద సర్వే ప్రారంభించారు. 600మీటర్ల పొడవు కలిగిన చెరువు కట్టను 8మీటర్ల వెడల్పుతో అభివృద్ధి చేయనున్నారు.

క్షీరాభిషేకం

దంతాలపల్లి: మండలంలోని తూర్పుతండా శివారు దుబ్బతండాను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రెడ్యానాయక్ చిత్రపటాలకు సోమవారం తండావాసులు క్షీరాభిషేకం చేశారు. ఎంపీటీసీ గుగులోతు హంజిభద్రి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కోటి నాయక్, ఉపాధ్యక్షుడు నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

కురవి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా రైతు బానోత్ లక్ష్మణ్(55) మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి సీరోలు మండలం చింతపల్లి శివారు కుమ్మరిబోడు తండా వద్ద చోటుచేసుకుంది. సీరోలు ఎస్సై రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరిబోడు తండాకు చెందిన లక్ష్మణ్ పశువులను తీసుకుని జాతీయ రహదారి పక్క నుంచి తండాకు వస్తున్నాడు. తండా సమీపంలోకి రాగానే మరిపెడ వైపు నుంచి చింతపల్లి వైపు ద్విచక్రవాహనంపై గార్ల మండలం కొత్తతండాకు చెందిన సపావత్ సురేష్ తన కుటుంబంతో వస్తున్నాడు. బైక్ వెనుక నుంచి స్పీడుగా వచ్చి లక్ష్మణ్‌ను ఢీకొట్టడంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారులు, కుమార్తె ఉన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



మహబూబాబాద్: పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్: అభివృద్ధి పనులకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కోరారు. జిల్లా కేంద్రంలో వివేకానంద సెంటర్ నుంచి ఈదులపూసపల్లి మెయిన్ రోడ్డు వరకు రూ.5కోట్లతో నిర్మాణం చేయనున్న పనులను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆ నిధులతో రోడ్డు విస్తరణ డివైడర్లు ఇతరత్రా నిర్మాణాలు చేయనున్నట్లు పేర్కొన్నాడు. కార్యక్రమంలో చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైఎస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, డీఈ సీహెచ్ ఉపేందర్ నాయకులు చిట్యాల జనార్దన్, రాజులింగుబాబు, రఘు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమ పాలకుడు కేసీఆర్

గూడూరు: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ పాలకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత స్థలం ఉన్న నిరుపేదలకు గృహలక్ష్మితో రూ.3లక్షలు చెల్లించే పథకాన్ని సీఎం కేసీఆర్ తీసుకొచ్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి బీఆర్‌ఎస్ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండి.ఖాసీం, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముక్కా లక్ష్మణ్‌రావు, కఠార్‌సింగ్‌నాయక్, సంపత్‌రావు, కోఆప్షన్ ఎండి.రహీం పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం పట్టివేత



నిందితుడు భాస్కర్ అరెస్టును చూపిస్తున్న అడిషనల్ ఎస్పీ, తొర్రూరు డీఎస్పీ, సీఐ

నెల్లికుదురు: ప్రజలు యూనిఫాం లేని పోలీసులని, ప్రజల భాగస్వామ్యంతోనే నేరాలను అదుపు చేయగలుగుతున్నామని అడిషనల్ ఎస్పీ జె.చెన్నయ్య అన్నారు. నెల్లికుదురు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం తొర్రూర్ డీఎస్పీ వెంకటేశ్వరబాబు, సీఐ సత్యనారాయణతో కలిసి అక్రమ వ్యాపారం చేస్తున్న నల్లబెల్ల నిందితుల వివరాలు వెల్లడించారు. సంగెం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన బాధావత్ భాస్కర్, గూడూరు మండలం రాములు తండాకు చెందిన తేజావత్ యాకూబ్ బీదర్ నుంచి ఓ మినీ డీసీఎంలో 120బస్తాల నల్లబెల్లం, 50కిలోల పటిక మరిపెడ మండలంలో సరఫరా చేసేందుకు తరలిస్తుండగా ఎస్సై క్రాంతికిరణ్ సిబ్బందితో సోమవారం పట్టుకున్నట్లు తెలిపారు. యాకుబ్ పారిపోగా భాస్కర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు. భాస్కర్‌పై దీంతో నాలుగు కేసులు నమోదైనట్లు తెలిపాడు. కాగా తొర్రూరు మండలం చింతలపల్లి శివారు కొమ్మనపెల్లి తండాకు చెందిన గుగులోతు అనిల్ ఇండికా కారులో బీదర్ నుంచి 17బస్తాల బెల్లం, 25కిలోల పటిక బెల్లం తరలిస్తుండగా మడిపెల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఎస్సై జగదీష్ సిబ్బందితో పట్టుకున్నట్లు తెలిపారు. అనిల్ పారిపోయినట్లు పేర్కొన్నారు. నెల్లికుదురు ఎస్సై క్రాంతికిరణ్, పోలీసు సిబ్బంది యాకస్వామి, రఘు, తొర్రూరు ఎస్సై జగదీష్ పోలీసు సిబ్బంది విజేందర్, శ్రీనివాస్‌లను అభినందిస్తు వారికి అడిషనల్ ఎస్పీ రివార్డులను అందించారు.

పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండాలి



వంటశాలను పరిశీలిస్తున్న వైద్య బృందం

మహబూబాబాద్ అర్బన్: పాఠశాల ఆవరణం, వంట చేసే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సీహెచ్‌ఓ ఎమ్.కృష్ణార్జున్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గుమ్ముడూరు ప్రాథమిక బాలికల పాఠశాలలో సోమవారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల స్వస్తిక్ కార్యక్రమంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణార్జున్ మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వంట చేసేటప్పుడు శుభ్రత పాటించాలన్నారు. పాఠశాలో విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఎక్కడ నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌యూఓ వడ్డెబోయిన శ్రీనివాస్, కుమార్, ఫార్మాసిస్ట్ శ్రీలక్ష్మి, ఏఎన్‌ఎం లావణ్య, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాల విక్రయం

మహబూబాబాద్: ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా అన్ని తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలను విక్రయించనున్నట్లు తపాలా శాఖ సహాయ పర్యవేక్షకులు ఎల్.సైదానాయక్ తెలిపారు. మహబూబాబాద్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాలలో రూ.25విలువ కలిగిన జాతీయ జెండాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆగస్టు 12తేదీ వరకు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో అమ్మకాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాంచందర్ రావు, సుధాకర్, ప్రభాకర్, భరత్‌కుమార్, అంకిత రెడ్డి, సుధాకర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల రాస్తారోకో



కురవి: జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న కార్మికులు



కేసముద్రంలో..

కురవి: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీపీ కార్మికులు మండల కేంద్రంలోని 365 జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్, మంజూర్‌అలీ, రామచంద్రయ్య పాల్గొన్నారు.
కేసముద్రం: తమ సమస్యలను పరిష్కరించాలంటూ కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై జీపీ కార్మికులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు శాంతింపజేసి రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమం నాయకులు శ్రీధర్, వెంకన్న, మంగీలాల్, తదితరులు పాల్గొన్నారు.
గార్ల: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గార్లలో గ్రామ పంచాయతీ కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సంఘం నాయకులు అప్పిరెడ్డి, దస్తగిరి, దాసు, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.
కొత్తగూడ: గ్రామ పంచాయతీ ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకుడు యాకయ్య, శంకర్, వెంకన్న, సాంబయ్య, రమేష్, సుమన్, రవి పాల్గొన్నారు.
డోర్నకల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 33వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో కార్మికులు సంధ్యారాణి, వీరన్న, ముధాకర్, గణేష్, వీరన్న పాల్గొన్నారు.

క్రషర్ పనులు నిలిపివేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతులు

గూడూరు: మండలంలోని పొనుగోడు శివారు బోడగుట్ట వద్ద నిర్వహిస్తున్న స్టోన్ క్రషర్‌లో పేలుతున్న బాంబుల శబ్దాలతో ఇంటి గోడలు బీటలువారి, వ్యవసాయ బావులు కూలిపోతూ నష్టపోతున్నామని, క్రషర్ పనులు నిలిపివేయాలని గాజులగట్టుకు చెందిన గ్రామస్తులు, రైతులు సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్ సెల్‌లో, గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెక్కొండ ప్రధాన రహదారిలో ఉన్నటువంటి స్టోన్ క్రషర్ ప్రాంతం పొనుగోడు శివారులో ఉందని, ఈ క్రషర్ సమీపంలో గాజులగట్టు గ్రామంతోపాటు తమకు చెందిన వ్యవసాయ భూములన్నీ ఉన్నాయన్నారు. ప్రతీ సంవత్సరం క్రషర్‌లో బాంబుల పేలుళ్లతో ఇంటి గోడలు పగులుతున్నాయని, అనేక రకాల నష్టం కల్గుతుందన్నారు. పైగా వ్యవసాయ బావులు పూడి నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు నాయిని భిక్షపతి, నర్సయ్య, ఇందిర, ధాన్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓల నిరసన

గార్ల: బీఎల్‌ఓలతో అసభ్యకరంగా మాట్లాడిన తహసీల్దార్ నారాయణమూర్తిని సస్పెండ్ చేయాలని బీఎల్‌ఓలు వివిధ పార్టీల నాయకులతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివారం సెలవుదినం కావడంతో బీఎల్‌ఓలు శిక్షణకు హాజరు కాలేదన్నారు. సోమవారం కార్యాలయానికి వచ్చిన బీఎల్‌ఓతో నిన్న ఎందుకు రాలేదంటూ అసభ్య పదజాలంతో, మెమో ఇస్తామని బెదిరింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ క్షమాపణ చెప్పడంతో బీఎల్‌ఓలు ధర్నాను విరమించి శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు పద్మ, సుజాత, కృష్ణకుమారి, సరిత, నాయకులు కందునూరి శ్రీనివాసరావు, వెంకట్‌లాల్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసు నమోదు

పెద్దవంగర: తాళంవేసిన ఇంట్లో దొంగలు పడిన సంఘటన మండల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రామచంద్రు తండాకు చెందిన జాటోత్ కృష్ణ తన గృహానికి తాళం వేసి వృత్తి రీత్యా హన్మకొండలో నివాసముంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువా తెరిచి రూ.33 వేల విలువచేసే 110 తులాల వెండి, విలువైన పత్రాలను దోచుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



చిన్నగూడూరు: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కవిత

గూడూరు: తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని, పౌష్టికాహారమే ఆరోగ్యకరమని అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి అన్నారు. మండలంలోని ఊట్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.
నర్సింహులపేట: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని సూపర్‌వైజర్ ఆర్.విజయ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత, అంగన్‌వాడీ టీచర్లు లలిత, సరోజన, శ్రావణి, విమల, సుహాసిని పాల్గొన్నారు.
మరిపెడ రూరల్: తల్లిపాలే పుట్టిన బిడ్డకు అమృతం లాంటివని ఐసీడీఎస్ సీడీపీఓ శిరీష అన్నారు. సోమవారం మరిపెడ మండలం గాలివారిగూడెం అంగన్‌వాడీ–1, 2 కేంద్రాల ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడెల్లి రామయ్య, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.
చిన్నగూడూరు: మండలంలోని జయ్యారం గ్రామ పంచాయతీలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్ కవిత, ఏడబ్ల్యూటీ వెంకటరత్నం పాల్గొని తల్లిపాల విశిష్టత, పౌష్టికాహారం గురించి గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎల్లమ్మ, స్వరూప ఉన్నారు.

ప్రాణాలు పోతేనే స్పందిస్తారా..

- ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు
- సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణ



వేలాడుతున్న విద్యుత్ తీగలకు ఏర్పాటు చేసిన కర్రలు

మరిపెడ రూరల్: ప్రాణాలు పోయేంత వరకు విద్యుత్ అధికారులు స్పందించరా గిరిజన మహిళా రైతు బానోతు మంగ ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం ఆమె మట్లాడుతూ.. మండలంలోని గుర్రప్ప తండా గ్రామ శివారు వ్యవసాయ బావి వద్ద విద్యుత్ స్తంభాల మధ్య లెవన్ కేవీ కరెంట్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. ఈవిషయాన్ని విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేయగా.. ఏఈ కొత్త విద్యుత్ పోల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొంది. అయినప్పటికీ ఏడాది గడిచిన ఇంత వరకు విద్యుత్ పోల్ ఏర్పాటు చేయలేదని ఆమె ఆరోపించింది. చేసేది లేక వేలాడుతున్న తీగలకు కర్రలను అడ్డంపెట్టినట్లు తెలిపింది. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించిన లూప్ లైన్ కరెంట్ తీగలు సరిచేయాలని బాధితురాలు వేడుకుంది.

తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర ఎనలేనిది



మహబూబాబాద్ రూరల్: గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మహబూబాబాద్: నివాళులర్పిస్తున్న నాయకుడు రావిష్, తదితరులు



కురవి: గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ప్రజాకవి, గాయకుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ సంతాప సభను సోమవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర ఎనలేనిదన్నారు. - సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్త సమాచారం

ప్రైవేట్ కళాశాలలపై చర్య తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల యాజమన్యాలు విద్యార్థులను అడ్మిషన్ల విషయంలో మోసం చేస్తు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శ బానోత్ దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇంటర్ విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం డీఐఈఓ సమ్మెట సత్యనారాయణకు పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చరణ్, దిలీప్, రఘు, సంతోష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

బస్ సర్వీస్ ప్రారంభం

గార్ల: జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రమైన గార్లకు ఆర్టీసీ బస్సు సర్వీస్ సోమవారం ప్రారంభమైంది. గార్ల పట్టణ ప్రజలు బస్సు రాగానే స్వాగతం పలికి డ్రైవర్, కండక్టర్లకు స్వీట్లు, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, రాధాకృష్ణ, ఈశ్వర్‌లింగం పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

గార్ల: పంటల్లో యాజమాన్య పద్ధతులు అవలంభించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ ఉద్యాన శాఖల ఏఓలు రామారావు, అరుణ్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని సీతంపేటలో మిర్చి నారుమళ్లను వారు సందర్శించారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

కేసముద్రం: కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న మోదీ సర్కార్‌పై ఈనెల 9, 10వ తేదీల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి మంద భాస్కర్ సోమవారం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనర్సయ్య, ఉపేందర్, శ్రీను, వెంకన్న, సతీష్, రవి, నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం

కేసముద్రం: మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సామల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వీరన్న, యూత్ అధ్యక్షుడు కిరణ్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం

కేసముద్రం: మండలంలోని అమీనాపురం గ్రామ పంచాయతీలో సోమవారం భవన నిర్మాణ, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు వైద్యులు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పురం రాజమణిరమేష్, డీసీ ప్రేమ్‌కుమార్, సీసీ ఉపేందర్ పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం

కురవి: మండలంలోని తట్టుపల్లి శివారు చంద్యా తండాలో గుగులోత్‌ధర్మానాయక్ అనే రైతుకు చెందిన మూడు గడ్డివాములు సోమవారం ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. రైతుకు నష్టపరిహారం చెల్లించాలని తండావాసులు కోరుతున్నారు.

కాంగ్రెస్ సంబురాలు

మహబూబాబాద్ రూరల్: దేశంలో, రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అనర్హత వేటుపై సుప్రీంకోర్టు స్టే విధించడంపై సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోత్ వెంకట్ నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షుడు తోట వెంకన్న, జిల్లా ఎస్టీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు బానోత్ ప్రసాద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి

బయ్యారం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు. మండలంలోని ఉప్పలపాడు ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రేవంత్, ప్రకాష్, రంజిత్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నెహ్రూసెంటర్: ఈనెల 9వ తేదీన ఆదివాసీ హక్కుల పోరాట దినోత్సవాన్ని వాడవాడలా నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. సోమవారం ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివిజన్ సహాయ కార్యదర్శి బిల్లకంటి సూర్యం, భాస్కర్‌రెడ్డి, యాకయ్య, వెంకటేశ్వర్లు, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి రుణమాఫీ చేయాలి

మరిపెడ: రైతులకు ఒకేసారి రుణమాఫీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బానాల రాజన్న డిమాండ్ చేశారు. మరిపెడలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ అని చెప్పి విడతల వారీగా చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు అనంతచారి, దేవయ్య, ఉప్పలయ్య, రమేష్ తదితరులున్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంల నిరసన



మహబూబాబాద్: సమస్యలు పరిష్కరించాలని సెకండ్ ఏఎన్‌ఎంలు అశ్విని, సుమలత, భాగ్య డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట వారు ఆందోళన చేశారు. కార్యక్రమంలో జయమ్మ, జ్యోతి, నసీమా, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కురవి: బోధకాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని బలపాల పీహెచ్‌సీ వైద్యురాలు స్రవంతి, సర్పంచ్ ముండ్ల ప్రమీల అన్నారు. సోమవారం గ్రామంలో బోధకాలు వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లు ఇవ్వాలి

మహబూబాబాద్: కేటీఆర్ కాలనీ ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా నేటికి విద్యుత్ మీటర్లు ఇవ్వకుండా విద్యుత్ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని కాలనీ వ్యవస్థాపకుడు కోండ్ర ఎల్లయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. కలెక్టరేట్ ఎదుట సోమవారం కాలనీ వాసులు ఆందోళన చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీను, బలరాజు, బాలకృష్ణ, ఉపేందర్, రాధ, సుధ, పద్మ, అరుణ పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి

కేసముద్రం: కేసముద్రం విలేజిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఇంటిబంధు' పథకాన్ని ప్రవేశపెట్టాలి

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటిబంధు పథకాన్ని ప్రవేశపెట్టాలని ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు కంచ వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

నిలిచిన తాగునీటి సరఫరా..



చేతిపంపు వద్ద నీరు తెస్తున్న మహిళ

డోర్నకల్: డోర్నకల్‌తోపాటు మండలంలో మిషన్ భగీరథ పైపుల ద్వారా రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహబూబాబాద్ సమీపంలో భగీరథ పైపులైన్ పగలడంతో డోర్నకల్‌తోపాటు మండలంలో రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచింది. దీంతో ప్రజలు చేతిపంపులు, వ్యవసాయ బావులను ఆశ్రయించారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో మున్నేరువాగు నిండుగా ప్రవహిస్తున్నా, పెద్ద చెరువులో బోరు బావులు ఉన్నా మున్సిపాలిటీ సిబ్బంది తాగునీటి సరఫరా కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.